క్లుప్తంగా

నేటి నుంచి కల్యాణ వెంకన్న ఆలయంలో ఆకాశ దీపార్చన



కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం

మాడుగుల రూరల్: కార్తీక మాసోత్సవాలను పురస్కరించుకుని కె.జె.పురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 2వ తేదీ శనివారం నుంచి ఆకాశదీపార్చన నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్ రాపేట రామకొండలరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం ఆలయంలో గల ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపార్చన నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

నేడు సింగన్నదొరపాలెంలో గ్రామసభ

కె.కోటపాడు : మండలంలోని సింగన్నదొరపాలెంలో శనివారం రీసర్వే గ్రామసభను నిర్వహించనున్నట్టు తహసీల్దార్ భాగ్యవతి తెలిపారు. రెవెన్యూ సంబంధిత సమస్యలు గల వారు ఈ సమావేశంలో అధికారులకు అర్జీలను అందించాలని సూచించారు.

శ్రమదానంతో తుప్పల తొలగింపు



శ్మశాన వాటికలో శ్రమదానం చేస్తున్న అంబేద్కర్ యూత్ సభ్యులు

దేవరాపల్లి: స్థానిక శ్మశాన వాటికలో పేరుకుపోయిన తుప్పలు, డొంకలను అంబేద్కర్ యూత్ సభ్యులు శ్రమదానంతో తొలగించారు. స్థానిక సర్పంచ్ పెంటమ్మ, సబ్బవరపు మాలిబాబు, సబ్బవరపు శివశంకర్, ఉల్లి చింతాలు, కాటపల్లి అచ్చిబాబుతో పాటు అంబేడ్కర్ యూత్ సభ్యులు స్వచ్ఛందగా శ్రమదానం చేశారు. గతంలో ఆక్రమణకు గురైన శ్మశాన వాటికను సర్వే చేసి దళితులకు అప్పగించడంతో శ్రమదానంతో శుభ్రపరిచారు.

భీమవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు



తనిఖీల గురించి అవగాహన కల్పిస్తున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో భీమవరం చెక్‌పోస్టు వద్ద నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం డాడ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఏజెన్సీ నుంచి వచ్చిన ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ విలేకరులతో మాట్లాడుతూ గంజాయితో పాటు మత్తు పదార్థాలు రవాణా జరగకుండా తనిఖీలు ఉపయోగపడతాయని తెలిపారు.అనంతరం తనిఖీలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ తరకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో 209 అర్జీల స్వీకరణ



అడవికామయ్య అగ్రహారం గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

మాకవరపాలెం: మండలంలోని శెట్టిపాలెంలో శుక్రవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో 209 అర్జీలు స్వీకరించినట్టు రీ సర్వే డీటీ కృష్ణమూర్తి తెలిపారు. వీటిని సకాలంలో పరిష్కరిస్తామని ఆయన చెప్పారు తెలిపారు. గ్రామ సభలో సర్పంచ్ అల్లు నాయుడు, వీఆర్వో లక్ష్మణరావు పాల్గొన్నారు.

అడవికామయ్య అగ్రహారంలో..

నాతవరం: మండలంలో నాతవరం పంచాయతీ శివారు అడవికామయ్య అగ్రహారంలో శుక్రవారం నిర్వహించిన గ్రామంలో 12మంది నుంచి అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ అడపా వేణుగోపాల్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమస్యలు పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీయరు.. మురుగు పారదు



బ్యాంక్ కాలనీలో పూడికతో దర్శనమిస్తున్న మురుగు కాలువ



కల్వర్టు వద్ద పేరుకుపోయిన పూడిక

- నర్సీపట్నం మున్సిపాలిటీలో అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- తీవ్ర దుర్గంధం వెదజల్లుతుండడంతో ప్రజలకు తప్పని అవస్థలు

వార్డులు : 28
కుటుంబాలు : 20,035
జనాభా సుమారు : 75,000
పారిశుధ్య సిబ్బంది
(అవుట్ సోర్సింగ్): 92 మంది
పర్మినెంట్ సిబ్బంది : 11 మంది
ఇంకా అవసరమైన సిబ్బంది : 50

నర్సీపట్నం: పురపాలక పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. పూడిక తీయకపోవడంతో మురుగుపారే పరిస్థితిలేదు. దుర్గంధం వెదజల్లుతుండడంతో పట్టణవాసులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాలువల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. చిన్నపాటి వర్షానికే రోడ్లపై మురుగు నీరు ప్రవహిస్తుండడంతో పాదచారుల అవస్థలు వర్ణనాతీతం. దుర్వాసన, దోమల సమస్యలతో పట్టణవాసులు సతమతమవుతున్నారు. పారిశుధ్యం క్షీణించి పలువురు రోగాల బారిన పడుతున్నారు. చికిత్స కోసం వేల రూపాయల చేతి చమురు వదిలించుకోవలసి వస్తోంది. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన మున్సిపల్ అధికారులకు చీమకుట్టినట్టయినా ఉండడం లేదు. నర్సీపట్నం మున్సిపాలిటీలో 28 వార్డుల్లో 20,035 కుటుంబాలకు చెందిన సుమారు 75 వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. అయితే కేవలం 103 మంది పారిశుధ్య సిబ్బంది మాత్రమే ఉన్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీల్లో పూడిక తొలగించకపోవడంతో మురుగునీరు పారడం లేదు. దీంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నెలల తరబడి పూడిక తీయక...

పెదబొడేపల్లి, ఇతర ప్రాంతాల్లోని డ్రైనేజీల్లో నెలల తరబడి పూడిక తీయడం లేదు. దీనికి తోడు పలు చోట్ల కాలువలను ఆక్రమించి ఇళ్లను నిర్మించడం వల్ల మురుగు నీరు ముందుకు పారడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శారదనగర్, బ్యాంక్ కాలనీ, శివపురం, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. కాలువల్లో నిత్యం మురుగు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాలవారు నరకాన్ని చవిచూస్తున్నారు.మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ మురుగు తొలగింపు జరగడం లేదని స్థానికులు చెబుతున్నారు. కాలువల నుంచి వెలువడుతున్న దుర్వాసన భరించలేక ఇళ్లలో నుంచి బయటకు రాలేకపోతున్నామని ఆయా ప్రాంతాల వారు తెలిపారు. దోమల బెడద కారణంగా రాత్రి కంటి మీద కునుకు ఉండడం లేదని వాపోతున్నారు.

పూడిక తొలగించాలి



కాలువల్లో పేరుకుపోయిన పూడికతో నానావస్థలు పడుతున్నాం. దుర్వాసన, దోమలతో నిత్యం నరకయాతన అనుభవిస్తున్నాం. ఎప్పటికప్పుడు కాలువల్లో పూడిక తొలగించాలి. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తరుచూ పరిశుభ్రం చేయాలి

– సత్తిబాబు, బలిఘట్టం

రూ.40 లక్షలతో పూడికతీత పనులు



మున్సిపాలిటీలోని ప్రధాన డ్రైనేజీలతో పాటు వార్డుల్లోని మురుగుకాలువల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.40 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం జరిగింది. త్వరలోనే పనులు మొదలు పెట్టి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– జంపా సురేంద్ర, మున్సిపల్ కమిషనర్, నర్సీపట్నం

కార్తీక మాస పూజలకు శివాలయాలు సిద్ధం



వడ్డాదిలో రామలింగేశ్వరస్వామి ఆలయం



వడ్డాదిలో శ్వేత వర్ణంలో ఉన్న శివలింగం




వడ్డాది బజారు వీధిలో భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయం

బుచ్చెయ్యపేట: కార్తీక మాస పూజలకు మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు ముస్తాబయ్యాయి. శనివారం నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. పురాతన కాలం నాటి శివాలయాలతో పాటు పలు ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. మండలంలో బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట, దిబ్బిడి,ఫంగిడి, సీతయ్యపేట, మంగళాపురం,తురకలపూడి, బంగారుమెట్ట,పెదమదీన,పొట్టిదొరపాలెం, మల్లాం,గంటికొర్లాం తదితర గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన పురాతన శివాలయాలున్నాయి. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా వడ్డాది బజారువీధి భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో శ్వేత వర్ణంలో గల శివలింగాన్ని ఏటా వేలాది మంది భక్తులు దర్శించుకుని పూజలు చేస్తారు.15న కార్తీక పూర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం, పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. నెల రోజుల పాటు పలు గ్రామాల్లో శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగనున్నాయి.

రోలుగుంట మండలంలో..

రోలుగుంట: కార్తీకమాసోత్సవ పూజలకు మండలంలోని శివాలయాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రం రోలుగుంటలోని కోనేరు చెంతన ఉన్న కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం, బుచ్చింపేటలో ఉన్న కొండపై ఏర్పాటు చేసిన శివ పార్వతుల విగ్రహాలు, ఇతర గ్రామాల్లోని శివాలయాల్లో కారీక మాస పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



రోలుగుంటలో కోనేరు చెంతనున్న కాశీవిశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం



బుచ్చింపేట కొండపై శివపార్వతుల విగ్రహాలు

ప్రైవేటు క్రషర్లకు చెరకు సరఫరా చేయొద్దు



ఖండివరంలో చెరకు రైతులకు అవగాహన కల్పిస్తున్న సుగర్ ఫ్యాక్టరీ ఫీల్డ్ సిబ్బంది

చీడికాడ: సభ్య రైతులు గోవాడ సుగర్ ఫ్యాక్టరీకి చెరకును సరఫరా చేసి, కర్మాగారం అభివృద్ధికి సహకరించాలని గోవాడ సుగర్స్ కేన్ ఇన్‌స్పెక్టర్ వి.కృష్ణమూర్తి సూచించారు. ఖండివరంలో రైతులకు శుక్రవారం ఫీల్డ్ సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల నుంచి క్రషింగ్ ప్రారంభంకానున్నదని చెప్పారు. ప్రైవేటు క్రషర్లకు చెరకును సరఫరా చేయవద్దని కోరారు. చోడవరం సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరకు రైతులకు ప్రభుత్వం నుంచి తగినంత ప్రోత్సాహం లభించడం లేదన్నారు. గత ప్రభుత్వంలో గోవాడ సుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధికి గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.89 కోట్లు విడుదల చేశారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.సన్నిబాబు, స్కూలు కమిటీ మాజీ చైర్మన్ గెంజి కృష్ణ, ఎంపీటీసీ సభ్యులు గెంజి స్వాతి బాలాజీ, స్థానిక వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షులు సుంకర కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలి



సీఐ పైడపునాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీపీ జగన్‌మోహన్, సర్పంచ్, ఎంపీటీసీలు

కె.కోటపాడు : ఆనందపురం సర్పంచ్ వంటాకు అప్పాజీ, ఆయన భార్య కనక, రైతు గురు బంగారు నాయుడుపై దాడికి పాల్పడిన విజయనగరం జిల్లా కృష్ణారాయుడిపేటకు చెందిన తొమ్మిది మందిని చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని ఎంపీపీ రెడ్డి జగన్ మోహన్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. ఈ మేరకు కె.కోటపాడు సీఐ పైడపునాయుడుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు దాడి ఎరుకునాయుడు, గొంప్రుపోటు సౌజన్య మాట్లాడుతూ ప్రజాప్రతినిధులపై దాడులకు పాల్పడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు రొంగలి సూర్యనారాయణ, లెక్కల నాగ విజయలక్ష్మి, సర్పంచ్ వేచలపు దొరబాబు, బండారు దేముళ్ళు, ఏటుకూరి రాజేష్, వర్రి రామునాయుడు, ఆదిరెడ్డి రామునాయుడు, చల్లా మంగ, చీపురపల్లి అచ్చిబాబు, వంటాకు మహేష్, వంటాకు శ్రీను పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

మాకవరపాలెం: మండలంలోని పైడిపాల, కొండఅగ్రహారంలలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ సచీదేవి పర్యవేక్షించారు. లబ్ధిదారులకు సకాలంలో పింఛన్ల నగదును అందించాలని సిబ్బందికి సూచించారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్లను పంపిణీ చేసేందుకు 4,200 మంది సిబ్బందిని నియమించినట్టు ఆమె తెలిపారు.

కెమెస్ట్రీ గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న రసాయన శాస్త్రం అతిథి ఉపన్యాసకుని పోస్టు భర్తీ కోసం అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు దరఖాస్తు చేసే అభ్యర్థులు రసాయన శాస్త్రం పీజీ కోర్సులో 55 శాతం మార్కులు దాటి ఉండాలని, యూజీసీ నెట్, స్టేట్ స్లెట్, పీహెచ్‌డీ కలిగిఉండాలని పేర్కొన్నారు. అనుభవం గల వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు. పై అర్హతలు కలిగి ఉన్నవారు ఈనెల 5వ తేదీ సాయంత్రం లోగా కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, 6వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీమంగమ్మను సంప్రదించాలని తెలిపారు.

పేద ఖైదీలకు అండగా లీగల్ అథారిటీ



చోడవరం సబ్‌జైలు అధికారులను ప్రశ్నిస్తున్న జిల్లా సీనియర్ జడ్జి వెంకటశేషమ్మ



నర్సీపట్నంలో జైల్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న వెంకటశేషమ్మ

చోడవరం రూరల్: ఆర్థిక పరమైన కారణాలతో న్యాయ సహాయం అందుకోవడంలో విఫలమైన ఖైదీలకు లీగల్‌సెల్ అథారిటీ అండగా ఉంటుందని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ శుక్రవారం స్థానిక సబ్ జైలును సందర్శించి ఖైదీల స్థితిగతులను, వారికి అందిస్తున్న సౌకర్యాలను జైలు అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను స్వయంగా పరిశీలించారు. రిమాండ్ ఖైదీలకు న్యాయపరమైన సహాయం అందించడానికి లీగల్ సర్వీసెస్ అథారిటీ సహకరిస్తుందని తెలిపారు. ఖైదీలతో మాట్లాడి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో హెడ్ వార్డర్ వీర్రాజు, ప్యానెల్ లాయర్ బి.రాజు పాల్గొన్నారు.

నర్సీపట్నం: సబ్‌జైల్‌ను డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసు అథారిటీ సెక్రెటరీ ఎం.వెంకటశేషమ్మ, మండల లీగల్ సర్వీసు కమిటీ, సీనియర్ సివిల్ జడ్జి పఠాన్ షీయాజ్ ఖాన్ శుక్రవారం సందర్శించారు. జైలు సూపరింటెండెంట్ ఎం.సన్యాసిరావును ఖైదీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో సమావేశమయ్యారు. ఈ తనిఖీలో జైల్ అడ్వొకేట్, ప్యానల్ అడ్వొకేట్ ఎం.గోవిందరావు, కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఖాళీ బిందెలతో నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట: మండలంలోని అర్ల కొండ శిఖరాగ్ర గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. రక్షిత పథకం లేక అవస్థలకు గురవుతున్నామని వారు చెప్పారు. 2019లో రెండు నెలల పాటు శ్రమదానం చేసి నుయ్యి తవ్వామని, కొన్ని నెలల పాటు మంచి నీరు లభించినా, తరువాత వర్షాలు పడి నీళ్లు బురదమయంగా మారాయని తెలిపారు. తప్పని సరి పరిస్థితుల్లో బురదనీటినే వడకట్టి వినియోగిస్తున్నామని చెప్పారు. దీంతో తరుచూ వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు.ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు ఘన నివాళి



నాతవరంలో పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు



చోడవరంలో పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నాతవరం: సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంటు పోలుపర్తి పార్థసారథి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయింతిని ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలు ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన దేశానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంటు ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చోడవరం రూరల్: ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌కు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘన నివాళి అర్పించారు. కళాశాల జాతీయ సేవా పథకం మూడు యూనిట్ల ఆధ్వర్యంలో పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో ఏక్తాదివస్ ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి మాట్లాడుతూ పటేల్ కృషితో అఖండ భారతదేశం సాధ్యమైందని చెప్పారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.రత్నభారతి మాట్లాడుతూ ఇటువంటి మహనీయుల జీవిత చరిత్రలు తెలుసుకోవడం ద్వారా జాతీయతా భావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, సీనియర్ ఉపన్యాసకులు సూర్యవతి, లక్ష్మీమంగమ్మ, రాధాకృష్ణ, వి.అప్పలనాయుడు, సీహెచ్.సుధీర్, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి



కుటుంబ సభ్యులతో కలిసి దివ్వెలు కొడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ



కుటుంబ సభ్యులతో కలిసి బాణసంచా కాలుస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్



అర్జునగిరిలో దివ్వెలు కొడుతున్న గ్రామస్తులు

సాక్షి, నెట్‌వర్క్: నర్సీపట్నం, మాడుగుల, చోడవరం నియోజకవర్గాల్లో ప్రజలు దీపావళి పండగను ఆనందోత్సాహాల మధ్య గురువారం రాత్రి జరుపుకొన్నారు. భక్తిశ్రద్ధలతో లక్ష్మీదేవికి పూజలు చేశారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ తన స్వగ్రామమైన కేజేపురంలో దీపావళిపండగను కుటుంబసభ్యులతో కలిసి జరుపుకొన్నారు. చోడవరంలో శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం, శ్రీ గౌరీశ్వర స్వామి ఆలయం, శ్రీ దుర్గమ్మ ఆలయాల్లో దీపాలు వెలిగించి ఆలయాల అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. నర్సీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కుటుంబ సభ్యులతో కలిసి దీపావళి సంబరాలను ఘనంగా జరుపుకొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

మాడుగుల: నిరుపేద కుటుంబాలకు చెందిన 500 మందికి అనకాపల్లి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు, రైల్వే బోర్డు మెంబరు, మోదకొండమ్మ ఆలయ కమిటీ సభ్యులు శ్రీనాదు శ్రీనివాసరావు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. తన జన్మదినం సందర్భంగా దుప్పట్ల పంపిణీతో పాటు పేదలకు అన్నసారాధన నిర్వహించారు. అనంతరం పట్టణంలో రొట్టెలు పంపిణీ చేశారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

పంచాయతీ రాజ్‌శాఖ క్వాలిటీ కంట్రోల్ డీఈ యర్రాపాత్రుడు



యం.బెన్నవరంలో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న క్వాలిటీ కంట్రోల్ డీఈ యర్రాపాత్రుడు

నాతవరం: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పంచాయతీ రాజ్ క్వాలిటీ కంట్రోల్ డీఈ యర్రాపాత్రుడు అన్నారు. యం.బెన్నవరం, నాతవరం పంచాయతీల్లో చేసిన పలు అభివృద్ధి పనుల నాణ్యతను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసిన, ప్రస్తుతం వివిధ దశల్లో ఉన్న అభివృద్ధి పనులను పరిశీలించినట్టు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు ప్రతి పనిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని, ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామ న్నారు. ఇటీవల పల్లె పండగ కార్యక్రమంలో మంజూరు చేసిన పనులను వచ్చే మార్చి నాటికి పూర్తి చేయాలని, అందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించి పనులను పూర్తి చేయాలని సూచించారు. పంచాయతీ రాజ్‌శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ, వర్కుఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనలతో విజ్ఞానం



సిమెంట్ కంపెనీ పనితీరు వివరిస్తున్న ఉద్యోగి

మాకవరపాలెం: క్షేత్ర పర్యటనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందుతుందని స్థానిక ఉన్నత పాఠశాల హెచ్ఎం అచ్యుతరామయ్య అన్నారు. ఎక్స్‌పోజర్ టూర్‌లో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులను కశింకోట మండలం బయ్యవరం వద్ద గల సాగర్ సిమెంట్ కంపెనీకి శుక్రవారం తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కంపెనీ పనితీరు, సిమెంట్ తయారీ, ఎగుమతి, కంపెనీలో భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఇలాంటి పర్యటనల వల్ల విద్యార్థుల్లో మరింత విజ్ఞానంతో పాటు విషయ పరిజ్ఞానం పెంపొందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు త్రినాథ్, కృష్ణకుమార్, త్రినాథరావు పాల్గొన్నారు.